

ప్రజాసంక్షేమ బడ్జెట్

రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. - 8లో



ఎల్లోమీడియా అండతో విషం

అసత్యకథనాలతో ఎల్లోమీడియా విషం కక్కుతోందని రాపూరు మండలం వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. - 8లో



ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పాళెం గ్రామంలో పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

'గంగ' విడుదలకు ఆదేశం



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, సంజీవయ్య, మురళీధర్

సైదాపురం(వెంకటగిరి) : కండలేరు నుంచి తెలుగు గంగ కాలువ ద్వారా నీటి విడుదలకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే నీటి విడుదలకు ఆదేశించారు. గురువారం నుంచి తెలుగు గంగ కాలువలో నీటి ప్రవాహం ప్రారంభంకానున్న నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

12న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12వ తేదీన జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై అప్రెంటీస్‌షిప్‌పై అభ్యర్థులకు అవగాహన కలిప్తారన్నారు. అలాగే ఆసక్తిగలవారికి ఆయా కంపెనీల్లో అప్రెంటీస్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తారని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో చదివి ఉత్తీర్ణులైన అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 94416 47174, 96764 86678 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్



ఎల్‌సీ రికార్డును పరిశీలిస్తున్న సీజీఎం గురవయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ సీజీఎం గురవయ్య తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజీఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి పగటి పూట 9 గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయ కనెక్షన్లు సైతం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఇళ్లకు లోఓల్టేజీ లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ట్రాన్స్‌కో సిబ్బంది అందుబాటులో ఉంటూ వినియోగదారులకు సేవలందించాలని ఆదేశించారు. అనంతరం ఎల్‌సీ రికార్డును పరిశీలించి, నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసురెడ్డి, డీఈఈ సతీష్‌బాబు, రమేష్‌బాబు, మోహన్, ఏఈ పుణ్యకోటి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,345 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,788 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వేదనారాయణునికి గరుడ వాహనం



గరుడ వాహనం అందిస్తున్న భక్తులు

నాగలాపురం: వేదవల్లీ సమేత వేదనారాయణ స్వామివారికి బుధవారం రూ.2లక్షల విలువైన ఇత్తడి గరుడ వాహనాన్ని తమిళనాడులోని పెరియపాళ్యానికి చెందిన భక్తులు విరాళంగా అందించారు. తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు మార్గంమధ్యలో వేదనారాయణుని ఆలయానికి విచ్చేసి డిప్యూటీ ఈఓ నాగరత్నానికి గరుడ వాహనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసులు, జానకిరామ్, ఉదయ్ కుమార్, అర్చకుడు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

మేనమామ గోరుముద్ద

ఇది కదా.. అభివృద్ధి



చిల్లకూరు: పారిచెర్లవారిపాళెంలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు (ఇన్‌సెట్) వెజిటబుల్ పలావు, కోడి గుడ్డు పులుసు

నాడు

ఒకే రకమైన రుచీపచి లేని భోజనం.. నాణ్యత లేమి.. పర్యవేక్షణ కరువు.. ఉపాధ్యాయుల ఉదాసీనత.. భోజన నిర్వాహకుల ఇష్టారాజ్యం .. వెరసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి నరకం అనుభవించేవారు. సరైన పోషకాలు లేని ఆహారాన్ని తినలేక అవస్థలు పడేవారు. విధిలేని పరిస్థితుల్లో ఇళ్ల నుంచి క్యారియర్లు కట్టుకుని వెళ్లేవారు. కూలీనాలి చేసే పేద పిల్లలకు భోజనం వండి క్యారియర్ కట్టి ఇచ్చి పంపడం కష్టతరంగా ఉండేది. ప్రభుత్వ పాఠశాలల్లో తాగడానికి కూడా నీళ్లుండేవి కావు. వారానికి ఒక్కరోజు కోడి గుడ్డు ఇవ్వాలన్నా కష్టతరంగా ఉండేది. సమస్యలు చెప్పుకున్నా పరిష్కారంగాక తల్లిదండ్రులు మిన్నకుండిపోయేవారు.

నేడు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుత రేట్లకనుగుణంగా మెనూ చార్జీలు పెంచారు. పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇచ్చారు. రోజుకో మెనూ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంటి భోజనాన్ని తలపించేలా రుచికరంగా ఆహార పదార్థాలు ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రక్తహీనత, బలవర్ధ ఆహారం కోసం రాగిజావ, చిక్కీలు అందిస్తున్నారు. పాఠశాలల్లో పరిశుద్ధమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. మేనమామ మాదిరిగా సీఎం జగనన్న అన్నీ సమకూర్చారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమలు చేస్తున్న మెనూ

సోమవారం:	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, లేదా వెజిటేబుల్ పలావు, కోడి గుడ్డు పులుసు, చిక్కీ
మంగళవారం:	చింతపండు పులిహోరా, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు, రాగి జావ
బుధవారం:	కూరగాయలతో అన్నం, ఆలూ కూర, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
గురువారం:	టమాట పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు, సాంబార్‌బాత్, లేక నిమ్మకాయ పులిహోర, రాగి జావ
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
శనివారం:	ఆకు కూర, అన్నం, పప్పు చారు, చక్కెర లేక బెల్లం పొంగలి, రాగి జావ

రుచికరంగా జగనన్న గోరుముద్ద

- సమూలంగా మారిన మెనూ
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- ఇంటి భోజనాన్ని తలపిస్తోందని కితాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

చిల్లకూరు: 'విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించాలి. ఆడ బిడ్డల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి. పేద తల్లిదండ్రులకు పెనుభారం కాకుండా రుచికరమైన భోజనం అందించాలి. ఇంటి భోజనాన్ని తలపించేలా రోజుకో మెనూ అమలు చేయాలి' అనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలు తీరును సమూలంగా మార్చేశారు. గతంకంటే భిన్నంగా రోజుకో మెనూ అమలు చేస్తున్నారు. విశ్రాంతి సమయంలో విద్యార్థులకు చిక్కీలు(వేరుశనగ ఉండలు) అందిస్తున్నారు. పౌష్టికాహారంలో భాగంగా శనివారం ఒక్కరోజు తప్ప మిగిలిన ఐదు రోజులు కోడి గుడ్డును అందిస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు రాగి మాల్ట్ (జావ) అందించేలా చొరవ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో హాజరు శాతం పెరిగింది. డ్రాపౌట్ల సంఖ్య తగ్గింది. బడిలోనే రోజుకో రకం కూరతో భోజనం చేస్తుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం తనిఖీలు

మెనూ అమలు చేస్తున్నారా..? ఆహార పదార్థాలన్నీ అందిస్తున్నారా.. భోజనం రుచికరంగా ఉందా..? అనే విషయాలను పరిశీలించేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడా రాజీపడకుండా నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు.

పేదలకు వెసులు బాటు

గతంలో ఉదయం వండి, క్యారీ కట్టి మధ్యాహ్నం పిల్లలకు ఇచ్చిపంపేవారు. కూలీనాలి చేసుకునే పేద తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఒక వేళ అనివార్య కారణాలతో క్యారీ ఇచ్చిపంపకుంటే ఆ రోజు పిల్లలు పస్తులతో అలమటించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ఆరోగ్యం, పౌష్టికాహారానికి ప్రాధాన్యం

ఆడపిల్లల్లో రక్త హీనత ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనం అమలులో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే వేరుశనగ ఉండలు ఇవ్వాలని భావించారు. అలాగే ఐరన్ శాతం పెరిగేలా రాగి మాల్ట్ (జావ) అందించేలా చర్యలు చేపట్టారు. రాగి జావను వారంలో మూడు రోజులు పాటు అందిస్తున్నారు. దీంతోపాటు ఐరన్ మాత్రలు అందిస్తున్నారు.



విద్యార్థులకు అందించే చిక్కీలు

ఇంటికంటే మెరుగ్గా రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తుండడంతో తల్లిదండ్రులు, పిల్లలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు నియోజకవర్గ సమాచారం

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
గూడూరు	85	5,247
చిల్లకూరు	71	3,717
కోట	73	3,519
వాకాడు	70	2,213
చిట్టమూరు	84	3,150

నాణ్యమైన భోజనం



పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ బాగుంది. ఇంట్లో మాదిరిగా రోజుకొక రకం వడ్డిస్తున్నారు. పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఇలాంటి భోజనం ఎప్పుడూ వడ్డించలేదు. అందుకే పిల్లలు ఇష్టంగా బడికి వెళ్తున్నారు.
– ననిమెనెల మస్తాన్, రుద్రవరం, కోట మండలం

ఇంటికి రావడం లేదు



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. గతంలో బడిలో అన్నంపెట్టే సమయానికి పిల్లలు ఇంటికొచ్చేసేవారు. ఇప్పుడు బడిలో రోజూ రుచికరమైన భోజనం పెడుతుండడంతో ఉదయం వెళ్లిన వారు ఒకేసారి సాయంత్రం ఇంటికి వస్తున్నారు. దీంతో వారికి ఖర్చులకు కూడా ఏమీ ఇవ్వడం లేదు.
–పదిముత్తం లక్ష్మి, ఏరూరు, చిల్లకూరు మండలం

రుచికరమైన భోజనం



నా మనవడు, మనవరాలు పారిచెర్లవారిపాళెం బడిలో చదువుతున్నారు. గతంలో పిల్లలు భోజన సమయానికి ఇంటికి వచ్చి తిని వెళ్లేవారు. ఇప్పుడు బడిలోనే ఇష్టంగా భోజనం తింటున్నారు. మేము బయట పనులకు వెళ్లి కూలిపనులు చేసుకోగలుగుతున్నాం.
– వహిదాబీ, పారిచెర్లవారిపాళెం, చిల్లకూరు మండలం



భోజనం పెట్టించుకునేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

ఆహార నియమాలు బాగున్నాయి



ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే నేడు ఆహార నియమాలు చాలా బాగున్నాయి. గతంలో పప్పుచారు, అన్నం మాత్రమే పెట్టే వారు. ఇప్పుడు రోజుకొక రకం వడ్డిస్తున్నారు. ఇలాంటి భోజనం ఇంటి వద్ద కూడా పిల్లలకు పెట్టలేమని తల్లిదండ్రులు చెబుతున్నారు.
- కావలి సతీష్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, వరగలి హైస్కూల్, చిల్లకూరు మండలం

చాలాబాగుంది



జగన్ మామయ్య సీఎంగా వచ్చినప్పటి నుంచి బడిలో పెట్టే మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. గతంలో అన్నం తినేందుకు కొంత మంది ఇబ్బంది పడేవాళ్లు. కోడి గుడ్డు, రాగి జావ, చిక్కీలు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు అన్నీ ఇస్తున్నారు. ప్రతిఒక్కరూ బడికి వస్తున్నారు.
- జీ.స్నేహప్రీతి, 10వ తరగతి, జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్, గూడూరు

విద్యార్థుల సంఖ్య పెరిగింది



ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన భోజనం పెడుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉండే బడి బయట పిల్లలు కూడా బడికి వస్తున్నారు. మా బడిలో మూడు కిలోమీటర్ల దూరంలోని పలు కాలనీల పిల్లలు 20 మందిదాకా క్రమం తప్పకుండా బడికి వస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు.
– బండ్ల సుదాకర్, హెచ్‌ఎం, పారిచెర్లవారిపాళెం

11న అనంతాళ్వార్ అవతారోత్సవం

తిరుమల: శ్రీ అనంతాళ్వార్ 970వ అవతారోత్సవాన్ని ఈనెల 11వ తేదీన తిరుమల పురుశైవారి తోటలో టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అనంతాళ్వార్ బోధనలు, రచనలపై సదస్సు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా స్థిరపడిన అనంతాళ్వార్ వంశీయులు ప్రత్యేక పూజలు, దివ్యప్రబంధ పాశుర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు చేపట్టనున్నారు. పురాణాల ప్రకారం అనంతాళ్వార్ ఆదిశేషుని రూపంగా శ్రీరామానుజాచార్యులతో కలిసి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. రామానుజాచార్యుని అభిమతానుసారమే శిష్యుడైన అనంతాళ్వార్ తిరుమలకు వేంచేసి స్వామివారి పుష్ప కైంకర్యానికి శ్రీకారం చుట్టినట్లు పురాణ కథనాలు ఉన్నాయి. ఒకనాడు అనంతాళ్వారు నిండు గర్భిణియైన భార్యతో కలిసి స్వామివారి ఆలయం వద్ద పూలతోటను ఏర్పాటు చేస్తుండగా బాలుని రూపంలో శ్రీవారు ప్రత్యక్షమయ్యాడు. తాను కాదన్నా తన భార్యకు ఉద్యానవన నిర్మాణంలో సహకరించాడన్న కోపంతో అనంతాళ్వార్ ఆ బాలునిపై గునపాన్ని విసిరాడు. మరునాడు స్వామివారి మూలవిరాట్టు చుబుకం నుంచి రక్తస్రావం చూసి పశ్చాత్తాపం చెందాడు. వెంటనే శ్రీవారి గాయానికి కర్పూరపు ముద్దను అంటించాడు. తద్వారా శ్రీవారి కృపకు పాత్రుడయ్యాడు. నేటికీ స్వామివారి చుబుకానికి కర్పూరాన్ని అంటించడం అనంతాళ్వారు దివ్యగాథను స్ఫురింప చేస్తుంది.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు

– ఉమ్మడి జిల్లాలో 337 టీచర్ పోస్టులు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో టీచర్ కొలువుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమైంది. ఉమ్మడి జిల్లాలో 337 పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. ఇందులో ఎస్జీటీలు 101, స్కూల్ అసిస్టెంట్‌లు 97, టీజీటీలు 139 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

విద్య.. వైద్యానికి తొలి ప్రాధాన్యం



చిల్లకూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీ శ

చిల్లకూరు : విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. బుధవారం మండలంలోని ఆస్పత్రులు, పాఠశాలలు, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. చింతవరం పీహెచ్‌సీలో మందుల నిల్వ, వైద్య సిబ్బంది సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న చికిత్సలను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రులను అత్యాధునికంగా తీర్చిదిద్దామన్నారు. పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఇంటి ముంగిటకే వైద్యులు వెళ్లి చికిత్సలందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇటీవల ఓ గిరిజన మహిళ కాన్పు కోసం గూడూరు ప్రాంతంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరి మృతి చెందినట్లు ఫిర్యాదు అందిందని, అందుకే చింతవరం పీహెచ్‌సీలో వసతులను పరిశీలించేందుకు వచ్చినట్లు వెల్లడించారు. పీహెచ్‌సీలో అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలు అందుబాటులో ఉంటే బయట ఆస్పత్రులకు రోగులు ఎందుకు వెళ్లాల్సి వస్తోందని వైద్యులపై మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వాస్పత్రుల్లోని వైద్య సేవలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇకపై సకాలంలో వైద్యం అందక ఒక్కరు కూడా మరణించకూడదని స్పష్టం చేశారు. అనంతరం చిల్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆన్‌లైన్ క్లాస్‌లు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్ఓ శ్రీహరి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మస్తానమ్మ, డీఈఓ శేఖర్, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, వైద్యుడు పాల్‌జాన్సన్, ఎంఈఓ సనత్‌కుమార్, రవూఫ్ పాల్గొన్నారు.

సుపరిపాలనకే ప్రజాదరణ

- సంక్షేమం.. అభివృద్ధే జగనన్న లక్ష్యం
- నాలుగున్నరేళ్లలో జనం ఖాతాల్లోకి రూ.కోట్ల నిధులు
- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వై ఏపీ నీడ్స్ జగన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మోహిత్‌రెడ్డి తదితరులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకే ఈ స్థాయిలో ప్రజాదరణ లభిస్తోందని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మండలంలోని కేకేవీపురంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ జగనన్న రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచారని కొనియాడారు. అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజానీకం కోరుకుంటోందని తెలిపారు. గడచిన నాలుగున్నరేళ్లలో రూ.కోట్ల నిధులను సంక్షేమ పథకాల కింద ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేశారని వివరించారు. ప్రతి కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఓటేయమని అడిగిన ధీశాలి సీఎం జగనన్న అని స్పష్టం చేశారు. పేద పిల్లలకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, రైతుభరోసా తదితర పథకాలు ప్రతి ఇంటి ముంగిటకు చేరాయని తెలిపారు. జగనన్న పాలనలో నిరుపేదలు ధైర్యంగా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచి ప్రజారోగ్య రక్షణకు భరోసా కల్పించారని స్పష్టం చేశారు. జగనన్న స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాటలో ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతానని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తమ కుటుంబసభ్యులే అని, అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిరంతరం జనంలోనే ఉంటానని వెల్లడించారు. అనంతరం సొరకాయలపాళెం, నెన్నూరు, నడవలూరు, సి.రామాపురం పంచాయతీల్లో మోహిత్‌రెడ్డి పర్యటించారు. రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ప్రతి చోటా ప్రజలతో మమేకమవుతూ, ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం అధిగమించేలా రుణాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బ్యాంక్ అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేలా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ లక్ష్మీ శ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, మండలాల వారీగా అందిస్తున్న రుణాల వివరాలను రైతులకు తెలియజేయాలని కోరారు. అప్పుడే ఆయా రుణాలపై వారికి అవగాహన వస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలకు అనుబంధంగా ఉన్న రంగాలకు లోన్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయం, విద్య, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు బ్యాంకర్లు భారీగా రుణాలను అందించారని ప్రశంసించారు. అనంతరం బ్యాంకు రుణాల వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం సుభాష్, ఆర్‌బీఐ ఎల్‌టీఓ పూర్ణిమ, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శేషగిరిరావు, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ శ్రీనివాసులు, సప్తగిరి బ్యాంక్ రీజనల్ మేనేజర్ జయకుమార్, నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్, పట్టుపరిశ్రమ లశాఖ జిల్లా అధికారి గీతారాణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ బడ్జెట్

- సంక్షేమం, అభివృద్ధికి సమతూకంగా నిధుల కేటాయింపు
- విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
- రూ.385 కోట్లతో చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు చర్యలు
- కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి
- తిరుపతికి ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు
- అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్



చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–2025 రాష్ట్ర బడ్జెట్ జనరంజకంగా ఉంది. ఈ పద్దులో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు పెద్దపీట వేశారు. రాజకీయంగా, అభివృద్ధి పరంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల అభివృద్ధి పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అపారమైన అభిమానం చూపిస్తోంది. రాష్ట్రబడ్జెట్‌లో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కీలక కేటాయింపులు జరిగాయి. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఆమోద యోగ్యంగా ఉండడంతో సర్వత్రా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉన్న నవరత్నాల పథకాలకు నిధులు కేటాయిస్తూనే మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు జరిగాయి.

బడ్జెట్‌లో రెండు జిల్లాల కీలక అంశాలు..

- అమూల్ సంస్థ సహకారంతో రూ.385 కోట్ల పెట్టుబడితో చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ చర్యలు. హెరిటేజ్ సంస్థ కోసం ఆ డెయిరీని చంద్రబాబునాయుడు మూసివేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తూరు డెయిరీని తెరిపించారు. ఈ డెయిరీ పునరుద్ధరణ చర్యల వల్ల 5 వేల మందికి ప్రత్యక్షంగా, 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కలుగుతుంది.
- తిరుపతి జిల్లాకేంద్రం రేణిగుంటలో ఉన్న విమానాశ్రయం అభివృద్ధి పనులు పునరుద్ధరించబడ్డాయి.
- హెచ్ఎన్ఎస్ఎస్ రెండో దశలో కుప్పం బ్రాంచ్‌కెనాల్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయబడ్డాయి. ఈ నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు. కుప్పం నియోజకవర్గంలోని 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు కుప్పం బ్రాంచ్‌కెనాల్ వల్ల నీరు లభ్యమవుతుంది.
- సుస్థిర పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూ ప్రజల రవాణా అవసరాలను తీర్చేందుకు తిరుపతి జిల్లాలో 100 ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగింది. వీటితో పాటు కొత్తగా 1500 కొత్త డీజిల్ బీఎస్–6 బస్సులకు అనుమతులు ఇచ్చారు.
- పుంగనూరు పశువులను సంరక్షిస్తున్నందుకు గానూ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డును అందుకుంది.
- గ్రామ పంచాయతీల్లో థీమాటిక్ అప్రోచ్-హెల్తీ విలేజ్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణకు పంచాయతీ రాజ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ ఏడాది జనవరిలో 3 రోజుల పాటు జాతీయ శిక్షణా శిబిరాలను తిరుపతిలో నిర్వహించడం జరిగింది.
- 2023 ఫిబ్రవరిలో తిరుపతిలో ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోషియేషన్ భాగస్వామ్యంతో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ఇన్నోవేషన్ సమావేశాలు నిర్వహించడం జరిగింది.

జనరంజకంగా ఉంది..



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. అన్నివర్గాల ప్రజలకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన అంశాలతో ఆమోద యోగ్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తోంది.

- వినాయకం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మహిళా సాధికారతకు ప్రాధాన్యం



గతంలో ఏ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చింది. బడ్జెట్‌లో మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. అలాగే విద్య, వైద్యరంగాలకు మంచి ప్రాధాన్యతనిచ్చారు. మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నివ్వడం హర్షణీయం.

- కావేరి, వ్యాపారి, చిత్తూరు నగరం

వ్యవసాయానికి అధిక నిధులు..



రాష్ట్రప్రజల శ్రేయస్సు కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రధానంగా వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించడం సంతోషకరం.

- చెంగారెడ్డి, పుంగనూరు

సంక్షేమానికి ప్రాధాన్యం..



రాష్ట్రబడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. జగనన్న అమ్మఒడి, నాడు–నేడు, ఉన్నత విద్యలో కీలకమైన జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక వంటి పథకాలకు మెరుగైన కేటాయింపులు చేయడం మంచి విషయం.

- హేమారెడ్డి, హెడ్‌మాస్టర్, కార్వేటినగరం మండలం

సమగ్ర సూచిక..



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర, జిల్లా సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా ఉంది. ముఖ్యంగా ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ కృషి అభినందనీయం. అందులో భాగంగానే విద్య, వైద్యం, రైతుల కోసం జరిపిన కేటాయింపులు అమోఘం.

- కుప్పారెడ్డి, రైతు

పేదల బడ్జెట్..



2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పేదల బడ్జెట్‌గా భావిస్తున్నాం. ప్రాధాన్యత అంశాలకు పెద్దపీట వేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజలతో పాటు కార్మికులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ఈ ప్రభుత్వం ప్రారంభం నుంచే ప్రాధాన్యత ఇస్తోంది.

- చల్లా చంద్రయ్య, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆర్థిక వృద్ధి రేటు పెరిగేలా..



శాసనసభలో ఆర్థికమంత్రి బుగ్గన ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ఆర్థికవృద్ధి రేటు పెరగడంతో రాష్ట్రం అభివృద్ధి సూచిక కనిపిస్తోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొని రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతిని సాధించడం హర్షదాయకం.

- సోమచంద్రారెడ్డి, పలమనేరు మేధావుల ఫోరం కన్వీనర్

వెనుకబడిన కులాల కోసం..



సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుతున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఇదే అంశానికి ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు వెనుకబడిన కులాల కోసం రికార్డు స్థాయిలో ఏకంగా రూ.71,740 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయం.

- ఆర్ముగం, శాంతిపురం

విద్య, వైద్యానికి అధికం..



రాష్ట్రప్రభుత్వం ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి దిక్సూచిగా నిలిచింది. ఇందులో ప్రధానంగా విద్య, వైద్యంతో పాటు బీసీల సంక్షేమం కోసం రూ.71 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం శుభ పరిణామం. అదేవిధంగా ప్రతి మెడికల్ కాలేజీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించారు.

- డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్వీయూ పాలకమండలి సభ్యులు

హర్షదాయకం..



రాష్ట్రప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించారు. విద్యాభివృద్ధికి అధిక నిధులు, పేదలకు నాణ్యమైన విద్య, అన్నివర్గాలకు మేలు జరిగేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టడం ఆనందదాయకం.

- నాగరాజు, రైతు, కుప్పం

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరిపైరును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పాళెం గ్రామ పరిసరాల్లోని పంటలను మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. ఈ మేరకు బుధవారం దెబ్బతిన్న పంటలను ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ శశిప్రియ, చంద్రశేఖర్‌రెడ్డి, అటవీ అధికారి దత్తాత్రేయ పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఏనుగుల గుంపును అటవీప్రాంతంలోకి మళ్లించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పంట నష్టపోయిన రైతులు దినేష్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అప్పస్వామి రెడ్డి, చంద్రారెడ్డికి పరిహారం మంజూరు చేయిస్తామని భరోసా కల్పించారు.

శ్రీవారి సేవలో పద్మశ్రీ అవార్డు గ్రహీత

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎల్లా వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

20న ఖాళీ టిన్‌ల విక్రయానికి టెండర్లు

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల విక్రయానికి కాంట్రాక్ట్ కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు ఈ ఏడాది డిసెంబరు వరకు ఖాళీ టిన్లను సేకరించవచ్చని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతి హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాలన్నారు. వివరాలకు మార్కెటింగ్ కార్యాలయంలో లేదా ఫోన్‌నంబర్ 0877–2264429ను సంప్రదించవచ్చని తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



రమణయ్య (ఫైల్)

గూడూరురూరల్ : మండలంలోని కందలి గ్రామానికి చెందిన ఈత ముక్కల రమణయ్య అలియాస్ జల్లయ్య(55) అనే వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. జల్లయ్య మంగళవారం మేకలు మేపేందుకు బయటకు వెళ్లాడని, రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా మృతదేహంగా కనిపించాడని పోలీసులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు : మండలంలోని కుక్కలగుంట గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. బుధవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి టీడీపీకి చెందిన మోతీష్, వెంకటయ్య, వెంకటరామయ్య, కొల్లాపూరి, రాఘవయ్య, నల్లయ్య, చెంగయ్య, లక్ష్మమ్మ, ఈశ్వరయ్య, చెంచమ్మ తదితర నేతలు కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్ సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, స్థానిక నాయకులు మధు యాదవ్, రామయ్య ఆచారి, సయ్యద్ కరీముల్లా, షేక్ మస్తాన్, గురునాథం, రాజా, గుణశేఖర్ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త



నిందితుడు చంద్రయ్య (ఫైల్)

కేవీబీపురం : స్థానిక కస్తూరీపురం గిరిజన కాలనీలో రత్నమ్మ(32) అనే మహిళపై ఆమె భర్త మంగళవారం అర్ధరాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. రత్నమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. మొదటి భర్తతో విభేదాలు రావడంతో అతడిని వదిలేసి, గ్రామానికే చెందిన చంద్రయ్య(45) అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఇది చంద్రయ్యకు మూడో వివాహం. అతడికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఈ క్రమంలో రత్నమ్మ మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానించిన చంద్రయ్య ఆమెతో గొడవపడ్డాడు. మాటా మాటా పెరగడంతో కత్తితో విచక్షణారహితంగా రత్నమ్మపై దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు రక్తపు మడుగులో పడి ఉన్న రత్నమ్మను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రేణిగుంటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే నిందితుడు చంద్రయ్యను బుధవారం మండలంలోని ఆరె గ్రామం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరురూరల్ : మండలంలోని టిడ్కో సముదాయంలోని ఇంట్లో బుధవారం ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. టిడ్కో గృహంలో నివసించే సుభాషిణి అనే మహిళకు ఇద్దరు కుమార్తెలు. ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో గూడూరు ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఇంట్లో ఆమె కుమార్తెలు సుప్రియ(17), రాజీ మాత్రమే ఉంటున్నారు. ఈ క్రమంలో రాజీ పని మీద బయటకు వెళ్లింది. ఇంతలో ఏమైందో తెలియదు కానీ, సుప్రియ ఇంట్లో ఉరేసుకుంది. రాజీ వచ్చి చూసేసరికి అక్క వేలాడుతూ ఉండడంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి సుప్రియను కిందకు దించారు. అప్పటికే బాలిక మరణించినట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

అత్తకు ఆశ్రయం ఇస్తానన్న కోడలు

- సాక్షి కథనంతో కదలిన అధికారులు



వృద్ధురాలికి ఆహారం అందిస్తున్న కోడలు, అధికారులు

సత్యవేడు: మండలంలోని మదనంబేడుకు చెందిన వృద్ధురాలు సరోజమ్మ(80)ను తాను ఇంట్లో ఉంచుకుని బాగోగులు చూసుకుంటానని కోడలు జానకి ముందుకొచ్చింది. మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో 'అండ కరువై.. గుండె బరువై! శీర్షికన వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. ఎస్ఐ వీరాంజనేయులు, గ్రామ కార్యదర్శి మాధవి, వీఆర్వో చంద్రశేఖర్, మహిళా పోలీసు దుర్గ, వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్‌తేజ్ సర్పంచ్ శివరంజని బుధవారం ఆ గ్రామానికి వెళ్లి ఆమె బంధువులతో మాట్లాడారు. తల్లిని వృద్ధాప్యంలో చూసేందుకు కుమార్తె నిరాకరించింది. ఆశ్రమంలో చేర్పిస్తామని తెలిపింది. గ్రామంలో భర్త చనిపోయి ఒంటరిగా ఉన్న కోడలు తాను అత్తకు ఆశ్రయం ఇస్తానని ముందుకొచ్చింది. అత్త బాగోగులు చూసుకునేందుకు కోడలు ముందుకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అయ్యింది. వృద్ధురాలి సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'ని అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

ఎల్లోమీడియా అండతో విషం



రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

రాపూరు : ఎల్లోమీడియా అండతో టీడీపీ నేతలు విషం కక్కుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. బుధవారం మండలంలోని వెలుగోను గ్రామంలో ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి పంగిలి గ్రామంలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారంటూ ఏబీఎన్‌లో అసత్య కథనం ప్రసారం చేశారని మండిపడ్డారు. దమ్ముంటే ఎవరైనా రుజువు చేయాలని సవాల్ విసిరారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర గల పాపకన్ను కుటుంబంలో ఇప్పటి వరకు ఎవరూ ఆక్రమణలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అనంతరం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



ఘటనాస్థలంలో కారు, బైక్



బాబు మృతదేహం

పాకాల : మండలంలోని ఉప్పువంక వద్ద బుధవారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. పులివర్తివారిపల్లెకు చెందిన బి.బాబు (45) బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ మహేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయానికి భారీ ఆదాయం

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వివిధ హక్కులపై నిర్వహించిన వేలంపాట ద్వారా రూ.3.18 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరినట్లు చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. బుధవారం బోయకొండ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజాసామగ్రి ఏడాది పాటు విక్రయ హక్కును రమణ రూ.50.27 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా ఆలయంలో పూలహారాలు, నిమ్మకాయ హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయ హక్కును రఘుపతి రూ.40 లక్షలు, పెద్దభోగం, చిన్నభోగం సేకరించి నిర్వహించుకునే హక్కును లోకేష్ రూ.90.4 లక్షలు, భక్తులు పెద్దభోగం, చిన్నభోగం శుభ్రపరిచి ఇచ్చు హక్కును సురేష్‌బాబు రూ.57.2 లక్షలు, కొండపైన క్లాత్‌రూం నిర్వహించుకునే హక్కు అంటే (సెల్‌ఫోన్, లగేజీలు మాత్రమే) రూ.36.40 లక్షలు, అమ్మవారికి భక్తులు కానుకలుగా ఇచ్చే చీరలు, రవికలను సేకరించుకునే హక్కును లలితమ్మ రూ.45 లక్షలు వేలం పాట పాడి దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే వేలం పాట ద్వారా ఈసారి రూ.56 లక్షల 38,884 రూపాయలు అధికంగా సమకూరిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు రామదాసు, భారతి, బుజ్జమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హైమావతి, రెడ్డెమ్మ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, దిగువపల్లి సర్పంచ్ సోని, కార్యదర్శి వసుంధర తదితరులు పాల్గొన్నారు.